


# పరదేశీ కథలు

## – చిట్టే సిద్ధ లలిత



– 127 –

# యుద్ధం చేసిన గాయాలు

**1990 సంవత్సరం నాటి కథ ఇది**. కువైట్ పట్టణం ఎప్పటిలాగే సందడిగా వుంది. ఆ సాయంత్రం పాత సూక్ (బజారు)లో అలీ, తన చిన్న నగల దుకాణంలో కూర్చుని తన చేతిలోని సన్నటి వెండి తీగలను అద్భుతమైన ఆభరణాలుగా మారుస్తున్నాడు. అతని పక్కనే అతని స్నేహితుడు అహ్మద్ కూర్చుని నగల డిజైన్ల గురించి చర్చిస్తున్నాడు.

మిత్రులిద్దరూ మెరిసే కళ్ళతో పర్షియన్ భాషలో వారి భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుకుంటున్నారు. అహ్మద్, అలీ ఇద్దరూ ఇరాన్ సంతతికి చెందినవారు. ఇద్దరూ మంచి స్నేహితులు. అహ్మద్ ఎప్పుడూ అలీకి తోడుగా వుంటాడు.

లైలా సిరియాకు చెందిన అమ్మాయి. తల్లిదండ్రులు కువైట్ పాత మార్కెట్ లోని ఆ వీధిలోనే చిన్న రెస్టారెంటును నడుపుతున్నారు.

ప్రతి సాయంత్రం, లైలా తన చెల్లెలు ఫాతిమాను వెంటబెట్టుకుని ఆ రెస్టారెంటుకు వచ్చి తండ్రికి సహాయం చేసేది.

అలీతో అక్కడే ఆమెకు పరిచయం అయింది. తరువాత ఆ పరిచయం ప్రేమగా మారింది.

లైలాకు కళల పట్ల చాలా ఆసక్తి, మధురంగా పాడేది. ఒక పుస్తకం ఎప్పుడూ ఆమె చేతిలో ఉండేది. లైలాను చూడగానే అలీ ముఖం వెలిగిపోయేది. లైలా, ఫాతిమాతో కలిసి అలీ దుకాణానికి వచ్చి, తనకు కావలిసిన ఆభరణాల గురించి చెప్పేది. అలీ ఆమెకు తగిన ఆభరణాలను అందంగా తయారు చేసి ఇచ్చేవాడు.

"ఫాతిమా అహ్మద్ ఓరచూపులు చూసుకునేవారు."

కాసేపు వారి నవ్వులు, మాటలు ఆ చిన్న దుకాణాన్ని ఆనందంతో నింపేవి. లైలా అలీతో కలిసి కలలు కంటోంది.

అలీ, ఆమె కోసమే బ్రతుకుతున్నాడన్నట్లు ఉండేవాడు.

కానీ లైలా తండ్రికి అలీ అంటే ఇష్టం వుండేది కాదు. అతడిని చూసినపుడల్లా ముఖం చిట్లించేవాడు.

అలా కాలం సంతోషంగా సాగిపోతున్న సమయంలో..

1990 ఆగస్టు 2 తెల్లవారుజామున, కువైట్ తూర్పు ఆకాశం కళ్ళుతెరుచుకునే లోపే, తుపాకుల మోతలతో మారుమ్రోగింది. బాంబులతో దద్దరిల్లింది.

ఆ శబ్దాలకు కువైట్ పట్టణం కంపించింది. ఇరాక్ సైన్యాలు సరిహద్దులను దాటి చొచ్చుకుని వచ్చి పెద్దయెత్తున కువైట్‌పై దాడి చేశాయి.

గాఢనిద్రలో వున్న అలీ వులిక్కిపడ్డాడు. అహ్మద్ అక్కడికి పరిగెత్తుకు వచ్చి "అలీ..! ఇరాకీ సైన్యం కువైట్‌లో ప్రవేశించింది అందరినీ చంపేస్తోంది మనం తొందరగా కువైట్ వదిలి పారిపోవాలి పద" అని అరిచాడు.

లైలా, ఫాతిమా ఎక్కడ ఉన్నారు?

నగరంలో చెలరేగిన అల్లకల్లోలం చూసి అతని గుండెల్లో భయం మొదలైంది. ఆ సమయంలో ఫోన్ లైన్లు కూడా పనిచేయడం లేదు. లైలా ఎక్కడుందో తెలియక, అతను పిచ్చివాడిలా మారాడు. అలీ కుటుంబం, అహ్మద్‌తో సహా, భద్రత కోసం పొరుగున ఉన్న సౌదీ అరేబియాకు పారిపోవాలని నిర్ణయించుకుంది.

అలీ లైలా నివసించే ప్రాంతం వైపు పరుగెత్తాడు. అక్కడ లైలా, ఫాతిమా, వారి తల్లిదండ్రులతో ఆ ఇంట్లోనే తలదాచుకున్నారు.

తమ ఇంటిని వదిలి వెళ్లడానికి తల్లిదండ్రులు నిరాకరించారు. "నేను మా వాళ్ళను వదిలి రాలేను అలీ. నువ్వు జాగ్రత్తగా వెళ్ళు" అని లైలా కన్నీళ్లతో బదులిచ్చింది. ఫాతిమా భయంతో లైలా చేతిని పట్టుకుని ఉంది, ఆమె చిన్న కళ్ళల్లో ప్రపంచం కుప్పకూలుతున్న భయం స్పష్టంగా కనిపించింది.

వెళ్ళిపోవడానికి ముందు, అలీ తన చేతిలో పట్టుకున్న చిన్న నాజూకైన వెండి పతకాన్ని లైలా చేతిలో పెట్టాడు. అది అతను స్వయంగా ఆమె కోసం తయారుచేసినది. దానిపై చిన్న అరబిక్ అక్షరాలతో "ప్రేమ ఎప్పటికీ నిలిచి ఉంటుంది" అని చెక్కబడి ఉంది.

"ఈ పతకం నా ప్రేమకు గుర్తు. లైలా.. మనం తప్పకుండా మళ్ళీ కలుస్తాం. ఈ యుద్ధం మనల్ని దూరం చేయలేదు" అంటుంటే అతని గొంతు వణుకుతోంది. లైలా ఆ పతకాన్ని గుండెలకు హత్తుకుంది, ఆమె కళ్ళనుండి ధారలుగా కన్నీళ్లు జారాయి. ఫాతిమా కూడా కన్నీళ్లతో అహ్మద్ ను చూసింది. ఆ చివరి చూపు, ఆ భయంకరమైన వీడ్కోలు, వారిద్దరినీ అంతులేని చీకటి దూరాలకు నెట్టేసింది.

అలీ తన కుటుంబంతో, అహ్మద్‌తో కలిసి సౌదీ సరిహద్దు వైపు పారిపోతున్నప్పుడు, వెనక్కి తిరిగి చూశాడు. మంటల్లో కాలిపోతున్న పట్టణం భయపెట్టింది. నల్లగా దట్టంగా కమ్ముకున్న పొగ, అతని గుండెను పిండివేసింది. వెనుతిరిగి లైలా కోసం రావాలనుకున్నాడు కానీ తల్లితండ్రులు అతడిని వద్దని వారిస్తూ సౌదీ వైపు తోసుకుంటూ పోయారు.

ఆ శరణార్థుల శిబిరంలో లైలా ఎక్కడుందో, ఆమె ఎలా ఉందో తెలియని ఆందోళన అతని మనసును నిరంతరం పీడించేది. "మనం తిరిగి కువైట్ వెళతాం అలీ, నువ్వు నిరాశ పడకు" అని అహ్మద్ అతన్ని ఓదార్చాడు.

* * *

కువైట్‌లో లైలా, ఫాతిమా వారి తల్లిదండ్రులతో తమ ఇంటిలోనే లోపలి గదిలో నక్కి ఉన్నారు. ఇరాకీ సైనికులు నగరంలో గస్తీ తిరుగుతున్నారు.

అందమైన అమ్మాయిలను ఎత్తుకెళ్ళిపోతున్నారనే వార్తలు తెలిసి వణికిపోతున్నారు.

ఒకరోజు, జనరల్ తారిక్ నేతృత్వంలోని సైనికులు వారి ఇంటి తలుపు తట్టారు. భయంతో వణికిపోతున్న కుటుంబం చూస్తుండగా, సైనికులు ఆహారం, విలువైన వస్తువుల కోసం ఇంటిని సోదా చేశారు. చెల్లాచెదురు చేసారు.

జనరల్ తారిక్, లైలా సున్నితమైన ముఖాన్ని, ఫాతిమా భయపడిన కళ్ళను చూసి ఒక్క క్షణం తటపటాయించాడు. అతని కళ్ళలో ఒక చిన్న మానవత్వం మెరుపులా మెరిసింది, కానీ అది వెంటనే కనుమరుగైంది. "మీరు ఇక్కడ ఉండలేరు, శరణార్థి శిబిరాలకు వెళ్ళండి" అని అతను కఠినంగా చెప్పాడు, కానీ ఆశ్చర్యకరంగా వారిని కొట్టకుండా వదిలేశాడు.

* * *

అది సౌదీ అరేబియాలోని శరణార్థి శిబిరం. వేలమంది కువైటీలు, పరదేశులు నిరాశతో, భయంతో అక్కడ గుమికూడారు. వారికి భవిష్యత్తు అంధకారంగా కనపడుతోంది. అలీ, నిత్యం లైలా గురించే ఆలోచిస్తున్నాడు. అహ్మద్, తన వంతుగా అలీని సముదాయించడానికి ప్రయత్నిస్తున్నాడు, అతనికి ఆహారం, నీరు అందించడానికి ప్రయత్నిస్తున్నాడు. శిబిరంలో అలీ డా. నీహారికని కలిశాడు.

దయగల, అనుభవజ్ఞురాలైన వైద్యురాలు ఆమె. నిస్వార్థంగా శరణార్థులకు సేవ చేస్తోంది.

డా. నీహారిక అలీ నిస్సహాయతను గమనించింది. అతనికి మానసిక మద్దతును ఇచ్చింది.

రేడియోలో వచ్చే వార్తలు, కువైట్‌లో మానవహక్కుల ఉల్లంఘనలు, సామూహిక హత్యల గురించిన కథనాలు అతని గుండెను చిదిమేశాయి. లైలా సురక్షితంగా ఉందా? ఆమె ఇంకా బతికే ఉందా? ఈ ప్రశ్నలు నిద్రలేకుండా చేశాయి. అతని నిస్సహాయత అతన్ని మరింత కృంగదీసింది. కానీ అతనిలోని ప్రేమ, లైలాను తిరిగి కలుసుకోవాలనే తపన, అతనికి కొత్త బలాన్ని ఇచ్చింది.

సంకీర్ణ దళాలు ఇరాక్ దళాలను తరిమికొట్టడానికి సిద్ధమవుతున్నాయని వార్తలు వచ్చాయి. అలీ ఈ పరిస్థితిని అవకాశంగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. అహ్మద్‌తో కలిసి, అతను స్థానిక అధికారులను సంప్రదించి, తను

సంకీర్ణ దళాలకు స్వచ్ఛంద సేవకుడిగా పని చేస్తానని తెలిపాడు. అతని అరబిక్ భాషా పరిజ్ఞానం, కువైట్ భౌగోళిక పరిస్థితులపై అతనికున్న అవగాహన సైన్యానికి ఎంతో సహాయపడ్డాయి. అహ్మద్ కూడా అలీకి సహాయకుడిగా మారాడు. అతను మ్యాప్‌లు చదవడంలో, స్థానిక సమాచారాన్ని అందించడంలో, అనువాదకుడిగా పనిచేయడంలో నిమగ్నమయ్యాడు. డా. నీహారిక కూడా సంకీర్ణ దళాలతో కలిసి వైద్య సహాయం అందించడానికి సిద్ధమైంది.

కువైట్‌లో, లైలా, ఫాతిమా, వారి తల్లిదండ్రులు ఆకలితో, భయంతో అలమటిస్తున్నారు. వారికి ఆహారం దొరకడం కష్టం అయింది. ఒక రోజు, ఫాతిమా నీటి కోసం బయటకు వెళ్ళినప్పుడు, ఇరాకీ సైనికుల చేతికి చిక్కింది.

వారు ఆమెను బంధించి వేధించారు.

సాయంత్రం వరకు చూసిన లైలా చీకటిమాటున చెల్లి ఫాతిమాను వెతుక్కుంటూ బయలుదేరింది.

విధివశాత్తూ ఆమె కూడా ఇరాక్ సైనికుల చేతికి చిక్కిపోయింది.

వారు ఆమెను జనరల్ తారిక్ వద్దకు తీసుకువచ్చారు. లైలా అతడిని చూసి భయంతో వణికి పోయింది.

జనరల్ తారిక్ ఆమె కళ్ళల్లోని అమాయకత్వాన్ని చూశాడు. అతనిలో అంతర్గత సంఘర్షణ స్పష్టంగా కనిపించింది. అతను యుద్ధంలో ఎన్నో క్రూరమైన పనులు చేశాడు, కానీ అమ్మాయిని చూడగానే అతనికి దయ కలిగింది. అతను ఆమెను విడిచిపెట్టమని తన సైనికులకు ఆదేశించాడు. కానీ లైలా తన చెల్లి ఫాతిమాను వెతికి అప్పగించమని ధైర్యంగా అడిగింది.

అప్పుడు తారిక్ ఫాతిమాను వెతకమని సైనికులకు ఆజ్ఞాపించాడు.

పక్క వీధిలోనే సైనికుల చేతిలో బంధింపబడి వున్న ఫాతిమాను విడిపించి తీసుకొచ్చారు వాళ్ళు.

చెల్లిని చూడగానే లైలా సంతోషించి జెనరల్ తారిక్ కు కృతజ్ఞతలు తెలిపింది.

అతడు కొన్ని ఆహార పదార్థాలు ఇచ్చి వారిని ఇంటికి పంపించేశాడు. ఇద్దరూ భయంతో, ఆశ్చర్యంతో ఇంటికి తిరిగి వచ్చి తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పారు.

వారు కూడా, జనరల్ తారిక్ చర్యకు ఆశ్చర్యపోయారు. అతడు మానవత్వానికి ప్రతీక అని ఆమె గ్రహించింది.

మరుసటిరోజు జనరల్ తారిక్ వచ్చి "మీరు ఈ ఇంట్లో వుండటం మంచిది కాదు నేను మిమ్మల్ని సురక్షిత ప్రాంతానికి తీసుకువెళతాను" అని చెప్పి మరో ప్రాంతానికి తరలించాడు.

అప్పటినుండీ జనరల్ తారిక్ వాళ్ళింటికి వచ్చి వారి క్షేమ సమాచారాలు అడిగి రొట్టెలు నీళ్ళు అందించి వెళ్ళేవాడు.

అతడి పట్ల వారికి గౌరవభావం ఏర్పడింది.

ఒకరోజు "లైలా అంటే తనకు ఇష్టమని తల్లిదండ్రులు వప్పుకుంటే నిఖా చేసుకుంటానని" తారిక్ లైలా తండ్రికి చెప్పాడు.

ఆయన లైలాకు తగిన వరుడని సంతోషించాడు. "అలాగే" అని మాట ఇచ్చాడు.

లైలా నిర్ఘాంతపోయింది.

అలీని తలచుకుని అతడిచ్చిన వెండి పతకాన్ని చూసుకుంటూ తిరిగి అలీని చూడగలనా అనుకుంటూ చాటుగా రోదించింది.

ఒక రోజు, సంకీర్ణ దళాలు కువైట్ నగర శివారులోని ఒక ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టడానికి వెళ్తున్నాయి. ఆ ప్రాంతం లైలా ఇంటికి దగ్గరగా ఉందని అలీకి తెలుసు. అతని గుండె వేగంగా కొట్టుకుంది. ఇది లైలాను వెతకడానికి ఒక మంచి అవకాశం.

లైలా ఇంకా ప్రాణాలతో వుందా ఇరాక్ సైనికులకు పట్టుబడి వారి దుశ్చర్యలకు బలయిందా? ఆ ఆలోచనకే అతడు వణికిపోయాడు.

గుండెను గట్టిగా చేసుకుని అతను దళాలతో కలిసి వెళ్ళాడు, అహ్మద్ కూడా అతనితో ఉన్నాడు. అతని కళ్ళల్లో ఆశ, భయం, ఆందోళన కలగలిసి ఉన్నాయి.

అక్కడ విధ్వంసం అంచనాకు మించి ఉంది. భవనాలు శిథిలమయ్యాయి, రోడ్లు ధ్వంసమయ్యాయి. కరెంటు లేదు.

ఆశగా లైలా ఇంటికి పరిగెత్తుకెళ్ళారు. తాళం వేసిన తలుపులు వెక్కిరించాయి. అతడి బాధ చెప్పనలవికాదు.

అక్కడ వున్న ఒక శిథిలమైన పాఠశాలలో, సహాయక బృందం కూలిపోయిన గోడలకింద చిక్కుకున్న వారిని బయటకు తీస్తోంది. అలీ అక్కడికి పరిగెత్తాడు. అక్కడే లైలా చదువుకుంది.

పాఠశాల ప్రాంగణమంతా ధ్వంసమై ఉంది. గోడలపై బుల్లెట్ గుర్తులు, రక్తపు మరకలు. అకస్మాత్తుగా, ఒక సగం కూలిపోయిన తరగతి గదిలో, గోడపై చెక్కబడిన ఒక పేరు అతని కంట పడింది. లైలా.. ఆ పేరు పక్కనే, తమ ఇద్దరి మొదటి అక్షరాలు, ఒక చిన్న గుండె గుర్తుతో చెక్కబడి ఉన్నాయి. అలీ గుండె వేగం పెరిగింది. అతనికి ఊపిరి ఆగినట్లైంది. ఆమె ఇక్కడే చదువుకునేది.

అతడికి కన్నీరు పొంగింది.

ఆమె ఇంకా బతికే వుందా! అతని కళ్ళముందు లైలా చిరునవ్వు మెరిసింది. ఆమెను ఎలాగైనా కనుక్కోవాలనే తపన అతనిలో ప్రబలమైంది. అహ్మద్, అలీ కళ్ళల్లోని ఆశను చూసి, అతని పట్టుదలను మెచ్చుకున్నాడు.

అతడు కూడా అప్పుడే ఫాతిమా పట్ల చిగురించిన ప్రేమను తెలియజేసి ఏడ్చాడు.

అలీ అహ్మద్ ను ఓదార్చాడు.

యుద్ధం చివరి దశకు చేరుకుంది. సంకీర్ణ దళాలు కువైట్‌ను ఇరాక్ సైన్యాల నుండి విముక్తం చేశాయి. కువైట్ విముక్తి పొందింది కానీ నగరం ఒక స్మశానాన్ని తలపించింది. నూనె బావులు కాలిపోతున్నాయి, ఆకాశం నల్లటి పొగతో నిండి ఉంది. అలీకి ఇప్పుడు ఒకే లక్ష్యం, అది లైలాను కనుగొనడం. అహ్మద్ అతనికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు.

అతను యుద్ధం ముగిసిన వెంటనే, సహాయక శిబిరాలు, ఆసుపత్రులు, అనాథాశ్రమాలు అన్నింటినీ వెతకడం మొదలుపెట్టాడు. డా. నీహారిక కూడా సహాయక బృందాలతో కలిసి కువైట్‌లో వైద్య సేవలు అందిస్తోంది. అలీ, అహ్మద్‌తో కలిసి డా. నీహారిక వద్దకు వెళ్లి లైలా గురించి వాకబు చేశాడు. డా. నీహారిక, అలీ కథ విని, అతనికి సహాయం చేస్తానని హామీ ఇచ్చింది.

రోజుల తరబడి నిద్రలేదు, ఆహారం లేదు. అతనిలో నిరాశ పెరుగుతోంది. అహ్మద్, అలీకి మానసిక మద్దతునిస్తూ, అతనితో పాటు వెతికాడు.

యుద్ధంలో గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న ఒక చిన్న వైద్య శిబిరం గురించి తెలిసి అక్కడ లైలా వుంటుందని వెతుక్కుంటూ వెళ్ళారు వారు.

అక్కడ లైలా కనపడలేదు కానీ లైలాకు వరసకు అత్త అయిన ఒక స్త్రీ వుంది. ఆమె దగ్గరికి వెళ్ళి లైలా గురించి వాకబు చేసారు.

"లైలాకు జనరల్ తారిక్ తో పెళ్ళి నిశ్చయమయింది. నువ్వు లైలాను మర్చిపో" అంటూ కఠినంగా చెప్పిందామె.

అలీకి నోట మాట రాలేదు.

ఇంతలో అదే సమయంలో ఫాతిమాతో కలిసి లైలా తన అత్తను చూడటానికి అక్కడికి రావడం కనిపించింది. అలీని చూసి ఆమె కళ్ళు పెద్దవిగా మారాయి.

"అలీ" అంటూ ఆనందంగా అరిచింది.

వారు ఒకరినొకరు చూసుకున్నారు. అలీ కన్నీళ్ళు కనపడకుండా మొహం అటువైపు తిప్పుకున్నాడు.

చుట్టూ ఉన్న ప్రపంచం వారికి అదృశ్యమైంది. ఫాతిమా సంతోషంతో కన్నీళ్లు పెట్టుకుంది. డా. నీహారిక, అహ్మద్ లైలాను చూసి సంతోషించారు. కన్నీళ్లు, నవ్వులు, సంవత్సరాల నిరీక్షణ, భయం, ఆశ అన్నీ ఆ కలయికలో కరిగిపోయాయి. కానీ లైలా ఇప్పుడు పరాయిదయింది. జనరల్ తారిక్ ను వివాహం చేసుకోబోతోంది.

ఆ ఆలోచనతో అలీ వికలమనస్కుడయ్యాడు. తలెత్తి లైలాను చూడలేకపోయాడు.

"నువ్వు వస్తావని నాకు తెలుసు అలీ.." ఆమె గొంతు వణుకుతోంది.

వారిద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. వారి శరీరాలపై యుద్ధ గాయాలు ఉన్నాయి. హృదయాల్లో కూడా గాయాలు సలుపుతున్నాయి.

డా. నీహారిక వారి మానసిక స్థితిని గ్రహించింది. నేను లైలా తండ్రితోనూ తారిక్ తోనూ మాట్లాడతాను. మీ ప్రేమ గురించి చెప్పి వప్పిస్తాను అంది. లైలా కళ్ళు సజలాలయ్యాయి.

ఆ సాయంత్రం డా. నీహారిక జనరల్ తారిక్ తోనూ లైలా తండ్రితోనూ మాట్లాడింది. లైలా తండ్రి అలీ పట్ల విముఖత చూపించాడు.

"ఏది ఏమైనా అలీ అయోగ్యుడని తారిక్ కే లైలాను ఇచ్చి వివాహం చేస్తానని" తీర్మానించాడు.

తారిక్ ఏమీ మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయాడు. డా. నీహారిక నిరాశపడింది. అలీని ఓదార్చే పనిలో పడింది.

ఐదు రోజులు గడిచాయి. ఆ రోజు రాత్రి సరిహద్దుల్లో దళాల దాడులు మొదలయ్యాయి. పిల్లమూకలు బాంబులతో ఇరాకీ సైనికులపై దాడి చేసారు.  బాంబులు బద్దలయ్యాయి. తుపాకులు మ్రోగాయి.

విధివశాత్తూ జనరల్ తారిక్ బాంబుదాడిలో తన రెండు కాళ్ళూ పోగొట్టుకున్నాడు.

కథ అడ్డం తిరిగింది. ఇప్పుడు లైలా తండ్రి మొహం పాలిపోయింది. ఇలా జరగడం యాధృచ్ఛికమే అయినా "లైలా రాత బాలేదు" అనేశారు తారిక్ తల్లితండ్రులు.

లైలా తండ్రికి కోపం వచ్చింది. ఆ కోపంలో అలీకి ఇచ్చి చేస్తానని చెప్పేసాడు. లైలా ఆనందానికి అవధులు లేవు.

యుద్ధం ముగిసింది. లైలా, అలీలతో పాటూ అహ్మద్, ఫాతిమాల పెళ్ళికూడా జరిగింది. వారు యుద్ధం చేసిన గాయాలను మరిచిపోతూ కొత్త జీవితాన్ని ప్రారంభించారు.

(మరోకథ వచ్చేనెల)

Post your comments